అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రూ.75 వేల కోట్ల అప్పు తెచ్చారని బీఆర్ఎస్ నేత కే వాసుదేవరెడ్డి ఆరోపించారు. ఈ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు తెచ్చి ఆస్తులు పెంచిందని చెప్పారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ ఇవ్వకుండా ఎవరి కోసం అప్పులు చేశారని ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు అని మాత్రమే అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉదయ్ స్కీమ్ తీసుకొచ్చి డిస్కమ్ అప్పులను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేయాలని చట్టం చేయడంతో రూ.41,159 కోట్లు చేర్చుకుని.. మొత్తం రు.3,85,340 కోట్లు అప్పులు అయ్యాయని వివరించారు. అప్పులపై ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో తెలంగాణ కింది నుంచి ఆరో స్థానంలో ఉందని చెప్పారు.

నాటుసారాపై 'ఎక్సైజ్' దాడులు

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా నాటుసారా, డ్రగ్స్, గంజాయిపై దాడులు కొనసాగిస్తున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఖమ్మం జిల్లాలో 52 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేశారని, ఎన్టీఆర్ సర్కిల్లో కేజీ గంజాయిని డీటీఎఫ్ టీం స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా గూడూరు సలార్‌తండాలో 43 లీటర్ల లిక్కర్, 500 కేజీల బెల్లం, 19 కేజీల పటిక, భూపాలపల్లి జిల్లాలో 10 కేజీల బెల్లం, 400 లీటర్ల పానకం, 22 లీటర్ల సారా స్వాధీనం, ఐదుగురు అరెస్ట్, కరీంనగర్ జిల్లాలో 22 లీటర్ల సారా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

ఆ పది స్థానాల్లో ఉపఎన్నికలు తథ్యం!

- ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో వణుకు మొదలు
- హైకోర్టు తీర్పుపై వెంటనే చర్యలు చేపట్టాలి
- మంత్రి శ్రీధర్‌బాబు తీర్పును వక్రీకరిస్తున్నారు
- దానం శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా ఉంటాడు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం డిపాజిట్ తెచ్చుకోవాలి
- మిగిలిన ఏడుగురిపై కూడా అనర్హత వేటు పడుతుంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద
- హైకోర్టు తీర్పు కాపీ అసెంబ్లీ కార్యదర్శికి అందజేత

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపునకు పాల్పడి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద చెప్పారు. ఆ పది స్థానాల్లో మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని వారు బుధవారం అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులకు అందించారు. అనంతరం వారిద్దరూ తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు హైకోర్టు తీర్పును వక్రీకరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఉప ఎన్నికలు వస్తాయన్న భయంతో గజగజ వణుకుతున్నారని కౌశిక్‌రెడ్డి చెప్పారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడియం శ్రీహరి పచ్చి మోసగాడని, పొద్దున కేసీఆర్ దగ్గర ఎన్నికల ఖర్చుకు డబ్బు తీసుకుని వెళ్లి సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరాడని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్‌లో డిపాజిట్ తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. అరికెపూడి గాంధీ కాంగ్రెస్ కండువా కప్పుకోలేదంటూ మాట మారుస్తున్నారని దుయ్యబట్టారు. ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలందరూ స్పీకర్ నిర్ణయం కోసం ఆగకుండా తమ పదవులకు రాజీనామాచేసి ఉప ఎన్నికలు ఎదుర్కోవాలని సవాల్ చేశారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ గత పదేండ్లలో సింగిల్‌గా ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేకు కండువా కప్పలేదని, అలా చెర్చుకున్నట్టు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో సీఎల్పీని బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేశారని గుర్తుచేశారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ సభ్యుడైతే తెలంగాణ భవన్‌కు రావాలని సూచించారు.

ఆ ఏడుగురు పై పిటిషన్ పెండింగ్‌లో ఉంది: వివేకానంద

కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మరో ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ తాము ఇచ్చిన పిటిషన్ స్పీకర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో కాలయాపన చేయొద్దని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. పీఏసీ చైర్మన్ విషయంలో ఏ నిబంధనలు పాటించారో శ్రీధర్‌బాబు చెప్పాలని డిమాండ్ చేశారు. పీఏసీకి 14 మంది నామినేషన్ వేస్తే ఎన్నికలు నిర్వహించకుండా.. అరికెపూడి గాంధీతో దొంగచాటుగా నామినేషన్ వేయించి ఎంపిక చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని, తడిబట్టతో వారి గొంతు కోశారని విమర్శించారు. ఆ పది మంది భవిష్యత్తును రాజకీయ సమాధి కట్టారని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పు తర్వాత ఆ ఎమ్మెల్యేలు ఆగమాగం అవుతున్నారని చెప్పారు. హైకోర్టు తీర్పుపై కాలయాపన చేయకుండా చర్యలు ప్రారంభించాలని అసెంబ్లీ సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చామని వారు తెలిపారు.

గాలిలో దీపంలా విద్యా వ్యవస్థ

- తక్షణమే సమీక్ష నిర్వహించాలి
- ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేయకపోవడం సిగ్గుచేటు
- దరఖాస్తుల సొమ్ముతో రుణమాఫీ చేస్తరా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ గాలిలో దీపంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తక్షణమే విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్షి నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ఎక్స్ వేదికగా బుధవారం డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేయకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే టీచర్లు లేక విద్యార్థులు టీసీలు తీసుకొని పోతున్నారని ఉదహరించారు. రుణమాఫీ కాని రైతులపై దరఖాస్తుల పేరుతో దోపిడీ మొదలైందని పేర్కొన్నారు. రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదా? అని ప్రశ్నించారు.

సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఊపిరి తీశారు

బీఆర్ఎస్ హయాంలో అమలైన 'సీఎం బ్రేక్ ఫాస్ స్కీమ్'ను అర్థాంతరంగా ఆపడం దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పథకంపై కేంద్రాన్ని దేబిరించటం హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. ఈ పథకం ఊపిరి తీసి ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల పొట్టగొట్టిందని మండిపడ్డారు. ప్రభుత్వ దవాఖానలు రోగులతో కిక్కిరిసిపోవడం దిగజారిన ప్రజారోగ్య వ్యవస్థకు, ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. డాక్టర్ల కొరత, మందుల లేమితో కొట్టుమిట్టాడుతున్న దవాఖానల్లో పరిస్థితులను చక్కదిద్దాలని చెప్పారు. సుడిగాలి (టోర్నడో) బీభత్సానికి ములుగు జిల్లా మేడారం–తాడ్వాయి అటవీ ప్రాంతంలో సుమారు 200 హెక్టార్ల మేర లక్షకు పైగా చెట్లు నేలకూలడం అత్యంత బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. నష్టపోయిన గిరిజనులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మరణంలోనూ వీడని బంధం

వృద్ధురాలైన భార్య మరణవార్త విని ప్రాణాలు విడిచిన భర్త

నందమూరి హనుమయ్య, సుందరమ్మ

బోనకల్లు, సెప్టెంబర్ 11: జీవిత చరమాంకంలోనూ ఓ వృద్ధ దంపతులు ఒకరినొకరు విడిచి ఉండలేకపోయారు. మరణంలోనూ వారి బంధం వీడలేదు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో ఈ విషాదకర ఘటన బుధవారం చోటుచేసుకున్నది. బోనకల్లు మండల కేంద్రానికి చెందిన నందమూరి సుందరమ్మ(84) అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆమె భౌతికకాయాన్ని ఇంటికి తీసుకురాగా, సహధర్మచారిణి మరణించిందన్న విషయం తెలుసుకున్న ఆమె భర్త నందమూరి హనుమయ్య(90) ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. కాసేపటికే ప్రాణాలు విడిచాడు. దీంతో ఆ కుటుంబంలో మరింత విషాదం నెలకొన్నది.

రాష్ట్రంలోకి ఎమార్ రీఎంట్రీ?

- ఫోర్త్ సిటీలో ప్రాజెక్టు అప్పగింత
- 2 వేల ఎకరాల్లో అభివృద్ధిపై ఒప్పందం?
- ఆ సంస్థపై అవినీతి ఆరోపణలు
- హైకోర్టులో కేసు..సీబీఐ దర్యాప్తు
- కేసు ఎత్తివేయాలని సంస్థ షరతు
- అవినీతి ఎమార్‌కు ఆహ్వానంపై వెల్లువెత్తుతున్న విమర్శలు



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఏపీలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న దుబాయ్ రియల్ ఎస్టేట్ కంపెనీ ఎమార్ ప్రాపర్టీస్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ రాష్ట్రానికి ఆహ్వానించినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వం ముచ్చర్లలో నిర్మించబోయే ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం కావాల్సిందిగా సదరు కంపెనీని ప్రభుత్వం కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముచ్చర్లలో 2 వేల ఎకరాల భూమిని అభివృద్ధి చేసేందుకు ఎమార్ సంస్థతో ఒప్పందం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. అయితే రాష్ట్రానికి వచ్చేందుకు ఎమార్ ప్రాపర్టీస్ సంస్థ ఒక షరతు విధించినట్టు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో తమ సంస్థ హైదరాబాద్‌లో చేపట్టిన 'బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు'పై నమోదైన కేసులను పరిష్కరించాలని కోరినట్టు సమాచారం.

బౌల్డర్ హిల్స్ కుంభకోణం ఇదీ

హైదరాబాద్, గచ్చిబౌలిలో బౌల్డర్ హిల్స్ పేరుతో నివాస సముదాయాలు, గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుకు సంబంధించి ఎమార్–ఎంజేఫ్ కంపెనీ భారీ కుంభకోణానికి పాల్పడినట్టు ఉమ్మడి రాష్ట్రంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై హైకోర్టులో కేసు దాఖలు కాగా దర్యాప్తును కోర్టు సీబీఐకి అప్పగించింది. ఆ కేసు ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. చంద్రబాబు సీఎంగా ఉండగా 2003లో గచ్చిబౌలిలో 535 ఎకరాల్లో బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం, ఎమార్ మధ్య ఒప్పందం జరిగింది. అయితే ఆ ఒప్పందంలో అనేక లొసుగులున్నట్టు వెల్లువెత్తాయి. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టును కొనసాగించింది. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, ఇతర వెసులుబాట్లకు తోడు మరిన్ని ప్రోత్సాహకాలను కట్టబెట్టింది. బాబు ప్రభుత్వం ఎమార్ సంస్థకు తక్కువ ధరకే భూమిని కేటాయించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టులో ఏపీ ఐఐసీ వాటాను 26 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. తద్వారా ప్రభుత్వానికి అప్పట్లోనే రూ.5వేల కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా. ఇక భూసేకరణలో కూడా అనేక అవకతవకలు జరిగినట్టు పలు సంస్థలో దర్యాప్తులో తేలింది. ఆ ప్రాజెక్టులో కొందరు కాంగ్రెస్ పెద్దలు బినామీల పేరుతో అక్రమంగా విల్లాలు దక్కించుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

అలాంటి కంపెనీపై అంత ఆసక్తి ఎందుకో?

అవినీతి ఆరోపణలున్న ఎమార్ కంపెనీని మళ్లీ తెలంగాణకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుండటంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేల కోట్లు దోచుకుందనే ఆరోపణలున్న కంపెనీని ఏ విధంగా తీసుకొస్తారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కంపెనీపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, ఇప్పుడు మళ్లీ ఆ కంపెనీని అదే ప్రభుత్వం వెనకేసుకురావడంపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మరోసారి స్కాంగ్రెస్‌ను చూడబోతున్నామా అంటూ పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనక ఎవరున్నారు, ఎవరికి అంత ఆసక్తి ఉందో వెల్లడించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పడిపోయిన పంటల సాగు

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : గత సీజన్‌తో పోల్చితే ఈ వానకాలంలో పంటల సాగు 5 లక్షల ఎకరాల వరకు తగ్గినట్టు వ్యవసాయ శాఖ తెలిపింది. నిరుడు ఇదే సమయానికి 1.28 కోట్ల ఎకరాల్లో సాగు కాగా, ప్రస్తుతం 1.23 కోట్ల ఎకరాలకే పరిమితమైంది. అత్యధికంగా వరి 2.62 లక్షల ఎకరాల్లో తగ్గగా, పత్తి 1.23 లక్షల ఎకరాలకు పడిపోయింది. 43 వేల ఎకరాల్లో సోయాబీన్, 30వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు తగ్గింది. గతేడాది 6.23 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, ప్రస్తుతం 5.97 లక్షల ఎకరాల్లోనే సాగైంది. పత్తి గతంలో 4.45 లక్షల ఎకరాల్లో సాగు కాగా, ప్రస్తుతం 4.32 లక్షల ఎకరాల్లో వేశారు. ఈ ఏడాది వ్యవసాయ శాఖ 1.29 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకు 1.23 కోట్ల ఎకరాలకే పరిమితమైంది.

కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

ఈ కుబేర్‌ను రద్దుచేయాలి

- ట్రెజరీ ద్వారానే బిల్లులు చెల్లించాలి
- టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల వేతనాలు, బిల్లులు చెల్లించేందుకు వినియోగిస్తున్న ఈ కుబేర్‌ను రద్దుచేయాలని, ట్రెజరీ ద్వారానే పాత విధానంలో ఉద్యోగుల బిల్లులను చెల్లించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. 2022 జూలై 1 నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరింది. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన బుధవారం నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని ప్రకటించాలని, ఈహెచ్ఎస్ అమలుచేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేయాలని, సీపీఎస్, యూపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను పునరుద్ధరించాలని, గ్రంథాలయాలు, మార్కెట్ కమిటీలు, ఎయిడెడ్, వైద్య విధాన పరిషత్, మోడల్ స్కూళ్లు, గురుకులాల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఏపీలో మిగిలిపోయిన 50 మందితోపాటు 9, 10వ షెడ్యూల్‌లోని ఉద్యోగులను తెలంగాణకు తిరిగి తీసుకురావాలని తీర్మానం చేసింది. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, కోశాధికారి శ్రీనివాసరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డు చిచ్చు

- ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్
- హామీలను విస్మరించి వెల్ఫేర్ బోర్డుల ఏర్పాటు ఉత్తర్వులు
- జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో 'వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు కార్మికుల్లో చిచ్చుపెట్టింది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఒక్క రుపాయి ఖర్చు లేకుండా ట్రేడ్ యూనియన్లను ఆర్టీసీలో అనుమతివ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆర్టీసీ యాజమాన్యం దానిని పరిగణనలోకి తీసుకోకుండా వెల్ఫేర్ బోర్డు నియామకానికి అంతర్గతంగా ఆదేశాలు జారీచేసింది. యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ట్రేడ్ యూనియన్ల రద్దు వల్ల ఏండ్ల తరబడి కార్మికులకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులను పొందలేకపోతున్నామని, కార్మికులు ట్రేడ్ యూనియన్ చట్టాలను కాదని పనిచేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇచ్చిందని, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం సహా ఆరు రకాల హామీలు అమలు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేస్తున్నారు. తాజాగా, మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించకపోవటంతో కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇదిలా ఉండగానే ఆర్టీసీ డిపోల్లో పాత వెల్ఫేర్ కమిటీ సభ్యుల స్థానంలో కొత్త వారిని నియమిస్తామని నోటీస్ బోర్డులపై ప్రకటనలు జారీ చేయటం కార్మికులను రెచ్చిగొట్టినట్టు అయ్యిందని ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 21న ఇందిరా పార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. సమావేశంలో జేఏసీ కో–కన్వీనర్లు యాదయ్య, సుద్దాల సురేశ్, జేఏసీ నాయకులు కమలాకర్‌గౌడ్, బాబు, ఎండీ అహ్మద్‌అలీ, బాల్‌రెడ్డి, జీ రాములు పాల్గొన్నారు. ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డు సభ్యుల నియామకాన్ని రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ డిమాండ్‌ను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వం, యాజమాన్యవైఖరికి నిరసనగా భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించటంపై గురువారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు, ప్రచార కార్యదర్శి రవీందర్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయి కార్యాలయం ఎదుట తోసుకుంటున్న టెండర్‌దారులు

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో 'ధాన్యం దంగల్'

ధాన్యం రవాణా టెండర్లలో ఉద్రిక్తత • ఫ్యాక్షన్ తరహాలో రౌడీయిజం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ధాన్యం తరలించేందుకు కలెక్టరేట్‌లో చేపట్టిన టెండర్ల ప్రక్రియలో ఘర్షణ నెలకొన్నది. ఒకే వర్గం వారికి టెండర్లు దక్కాలన్న పన్నాగంలో భాగంగా ఆఫ్‌లైన్ టెండర్లు వేసే వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి ధాన్యం రవాణా కోసం బుధవారం ఐడీవోసీలోని సివిల్ సప్లయ్ మేనేజర్ కార్యాలయంలో టెండర్ ప్రక్రియ కొనసాగింది. ఇదివరకే కొందరు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసినప్పటికీ, ఆఫ్‌లైన్‌లో వేసేందుకు అవకాశం ఉండడంతో పలువురు వచ్చారు. ఓ వర్గం వారు తమకే టెండర్ దక్కాలన్న ఉద్దేశంతో ఆఫ్‌లైన్‌లో టెండర్లు వేసేందుకు వచ్చిన వారిని అడ్డుకున్నారు. వారి టెండర్‌పత్రాలను లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సైలతో బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ ఎవరూ అడ్డుకోలేకపోయారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందినవారు టెండర్లను దక్కించుకునేందుకు అధికారులతో కుమ్మక్కై ఫ్యాక్షన్ తరహాలో ఇదంతా నడిపించినట్టు టెండర్‌దారులు వాపోయారు. టెండర్లన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

యాదాద్రి పవర్ మార్చి నాటికి సిద్ధం

- డిసెంబర్‌లో 3 యూనిట్లు పూర్తి
- నిర్వాసితులకు ఉద్యోగాలు
- రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్‌తో ట్రయల్‌రన్
- స్విచ్ ఆన్ చేసిన డిప్యూటీ సీఎం

యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నిలదీస్తున్న భూ నిర్వాసితులు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ) : వచ్చే ఏడాది మార్చి 31 నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఐదు యూనిట్ల ద్వారా 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు ఉపముఖ్య మంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఏడాది చివరికి మూడు యూనిట్లను ప్రారంభిస్తామని వెల్లడించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భట్టి నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ట్రయల్ రన్‌కు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ప్లాంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 31 నాటికి మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ఈ పవర్ ప్లాంట్ ద్వారా యూనిట్ విద్యుత్తును రూ.6.35కు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చివారికి భూసేకరణ నిధులతోపాటు ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యాదాద్రి ప్లాంట్‌తోపాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం ఆదేశాలిచ్చారని, వారికి నిర్వాసితుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఇందులో జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని మంత్రుల బృందానికి వివరించారు.

మంత్రులను నిలదీసిన నిర్వాసితులు

యాదాద్రి పవర్‌ప్లాంటుకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు , మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిని భూ నిర్వాసితులు, ల్యాండ్ లూసర్స్ అడ్డుకున్నారు. పవర్ ప్లాంటుకు భూములిచ్చిన తమకు ఉపాధి కల్పించలేదని నిలదీశారు. స్పందించిన మంత్రులు ప్లాంటుకు భూములు ఇచ్చిన వారు దేవుళ్లతో సమానమని తెలిపారు. మూడు నెలల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను